# 14. కొడుకూ - కూతురూ

మంగళవాద్యాలతో పెళ్ళివాళ్ళు దేవుడికి ఎదురు నడుస్తున్నారు.

పట్టుచీరలు కట్టుకుని, చేతిలో హారతి పళ్ళాలు పట్టుకుని ఇంటి ముందుగా ఏడెనిమిది మంది ఆడవాళ్ళు బ్యాండు మేళం వెనుక దేవుడిగుడికి నవ్వుతూ, తుళ్ళుతూ గల గల మాట్లాడుకుంటూ పోతున్నారు.

ముంగిట్లో మంచంమీద కూర్చుని పోతున్న పెళ్ళివాళ్ళని చూస్తున్న గంగమ్మ మనసు ఆవేదనతో, బాధతో మూలిగింది.

ఊళ్ళో రెండు పెళ్ళిళ్ళు జరుగుతున్నాయి. రెండూ అమ్మాయిలవే.

ఉదయం నుంచీ బ్యాండు వాద్యాలతోనూ, పెళ్ళికి వచ్చే వాళ్ళూ పోయేవాళ్ళతోనూ వీధి అంతా సందడి సందడిగా, కలకలంగా ఉంది.

ఇప్పుడు పెళ్ళి జరుగుతున్న అమ్మాయిలు ఇద్దరూ కూడా రజనికంటే చిన్నవాళ్ళే.

రజనికి మరి ఆ ఘడియలు ఎప్పుడు వస్తాయో!

ఇప్పుడు రజనికి పాతికేళ్ళు వస్తున్నాయి.

మనసులో కూతురు ఆలోచనలు రావడంతో లోపలికి చూసింది.

రజని లోపల వంటచేస్తూ, తాలింపు వేస్తోందిలా ఉంది వాసన ఘుమఘుమలాడుతూ వస్తోంది.

గొడ్లకొట్టం దగ్గర్నించి వచ్చిన రాములు తొట్టిలోనుంచి చెంబుతో నీళ్ళు ముంచుకుని వీధి వాకిట్లోనికి పోయి కాళ్ళు కడుక్కుని ముంగిట్లోనికి వచ్చి మరో మంచం వాల్చుకుని కూర్చున్నాడు.

"అబ్బాయి దగ్గరికి పోయి రావయ్యా, పోయి మాట్లాడిరా" అంది గంగమ్మ.

దాదాపు నెల రోజుల్నించీ ఈ మాట భర్తకి చెపుతూనే వుంది.

"పోయి ఏం మాట్లాడమంటా? వాడికి తెలియదా ఏంది? ఎన్నిసార్లు చెప్పినా యినుకోవేమే"?

"అట్టంటే ఎట్టయ్యా? ఇయ్యాలవాడికి పట్టకపోయినా మనకి తప్పదుగా?"

"అయితే నువ్వనేది ఏందే?" కోపంగా అన్నాడు రాములు.

"అది కాదయ్యా... అడగందే అమ్మయినా బువ్వపెట్టదు. పోయి మాట్లాడి వస్తే మన తప్పులేకుండా ఉండిద్ది. ఏదిపోయి ఎట్ట వచ్చినా రేపు మాట ఒకటి ఉండిద్ది. విషయం ఏందో తేల్చుకునిరా. ఎంతకాలం ఈడు వచ్చిన బిడ్డని ఇంట్లో పెట్టుకుందాం? దాని ఈడు వాళ్ళందరికీ పెళ్ళిళ్లయి పిల్లాపా పలు కూడా పుట్టారు" బతిమాలుతున్నట్టూ, నచ్చచెబుతున్నట్టుగా అంది గంగమ్మ.

"నేను కాకపోతే నువ్వుపోయి రాకూడదూ? నీకేం? నా మాట కంటే నీ మాటే వింటాడు వాడు"

"నా మాట ఏం లెక్క చేస్తాడయ్యా? అదేమంటే నీకుకూతురిమీద బెమ అంటాడు. నువ్వుపోయి వస్తేనే బాగుండిద్ది" అంది గంగమ్మ.

కొడుకు ధోరణిలో వచ్చిన మార్పు రాములుకి బాగా తెలుసు. భార్య మాటని పూర్తిగా తిరస్కరించలేక, కొద్దిసేపు మౌనంగా ఉండి తరువాత అన్నాడు.

"నీ మాటని ఎందుకు కాదనాల్లే! రేపు పోయొస్తా. ఎగదాలకి పోవాలి. అన్నం అయిందా?"

"అన్నం పొద్దున్నే వండా. అమ్మాయి కూరచేస్తంది. అయిందట్టుగా ఉంది. రజనీ... నానకి అన్నం పెట్టమ్మా" మంచం మీద కూర్చునే కూతురికి చెప్పింది గంగమ్మ.

"నాకు టైం అవతందమ్మా!. లేచి నువ్వుపెట్టరాదూ?" అంటూ బయటకి వచ్చిన రజని, గూట్లో ఉన్న రెండు పుస్తకాలూ, పెన్నూ తీసుకుని కాళ్ళకి చెప్పులు వేసుకుని హడావుడిగా వెళ్ళిపోయింది.

"ఏమిటో మనపని ఇలా అయిపోయింది. ఒక్కబిడ్డకి పెళ్ళి చేయలేకపోతున్నాం" బయటికి వెళ్ళిన కూతుర్ని చూస్తూ అన్నాడు రాములు.

రాములు, గంగమ్మ దంపతులకి ఇద్దరు పిల్లలు. కొడుకూ, కూతురూ.

ఆరు ఎకరాలు స్వంత పొలం ఉంది.

భార్యా భర్తలు ఇద్దరూ కష్టపడి పనిచేసేవాళ్ళు.

కొడుక్కి ఆరేళ్ళ క్రితం పెళ్ళిచేసారు.

అతని పేరు వేణు. చదువులో అంత చురుకుగా ఉండేవాడు కాదు. అతి కష్టంమీద ఇంటర్మీడియట్ వరకూ చదువుకున్నాడు.

కొడుక్కీ, కూతురికీ ఐదేళ్ళ వయసు తేడా ఉంది.

పెళ్ళయిన తరువాత స్నేహితుడితో కలిసి రెడీమేడ్ బట్టల దుకాణం పెట్టుకుంటానని టౌన్‌కి చేరుకున్నాడు.

భార్యాభర్తలు ఇద్దరూ తమ పొలంలో పని చేసుకుంటూ, తమకి పనిలేనప్పుడు కూలీనాలీకి పోతూ, బర్రెని ఒక దాన్ని పెట్టుకుని పాడి అమ్ముకుంటూ, రూపాయీ రూపాయీ ముడివేసి దాదాపు పదేళ్ళపాటు కష్టపడి లక్ష రూపాయలు కూడబెట్టారు, కూతురు పెళ్ళికి అక్కరకి వసాయని.

కొడుక్కి పెళ్ళప్పుడు లక్ష రూపాయలు కట్నంగా ఇచ్చారు. అప్పుడు పెళ్ళి ఖర్చులు యాభైవేలు పోగా ఇంకా యాభైవేలు మిగిలాయి.

"నేను పొలం పని చేసే వాడ్ని కాదునానా. అసలు మనకి ఉన్నది ఎంత పొలం, ఎంతకతా? గట్టిగా చేసుకుంటే నీ ఒక్కడికే సరిపోదు. నేను టౌన్‌కి పోయి యేపారం చేసుకుంటాను. ఏముంది, టౌన్‌కి ఇట్టపోయి అట్ట సంపాదించుకోవచ్చు. టౌన్లో కిళ్ళీబంకు పెట్టుకున్నాడు లక్షలు సంపాయిస్తున్నాడు. మనవూళ్ళో ఉంటే ఏం ఉండిద్ది?" పెళ్లయిన నెలరోజులకి అన్నాడు వేణు.

"నువ్వు సంపాదించుకుంటానంటే అంతకంటే కావాల్సిందేం ఉందయ్యా? నీకు ఎట్టబాగుండిద్దనుకుంటే అట్ట చెయ్యి. నువ్వు బాగుంటమే మాక్కావాలి"

"టౌన్‌లో యేపారం అంటే మాటలు కాదుగదా నానా? కొట్టు అద్దెకిచ్చినోడు బయానా పాతికవేలో, యాబయివేలో కట్టమంటాడు. ముందు మనం పెట్టుబడి పెట్టాలి"

"పెట్టుబడి లేకుండా యాపారం ఎట్టచేస్తార్లేరా? అంతమాత్రం తెలియదా ఏంది నాకు?"

"పెట్టుబడే నానా కావాల్సింది. ఇద్దరి మీదా రెండు లక్షలు పెడదామనుకుంటున్నాం. చెరొక లక్ష. నా దగ్గిర కట్నం యాభైవేలు ఉన్నయ్యి. నువ్వు ఒక యాభైవేలు ఇయ్యి నానా"

"నీకు తెలియకుండా నా దగ్గిర ఎక్కడ వున్నయ్యిరా?"

"అయ్యో నానా... అమ్మాయికి కట్నం కోసం ఉంచిన డబ్బులు"

"అయ్యి ఇస్తే అమ్మాయికి పెళ్ళిరా?"

"పెళ్ళి ఇప్పుడల్లా చేయం కద నానా? అమ్మాయి చదువుకుంటండే? పెళ్ళినాటికి అంతకి అంత తిరిగి ఇస్తానానా"

"నిజమేర్రా. మళ్ళీ ఏమైనా తేడా పడితే... అమ్మాయి కోసం ఉంచిన సొమ్మాయే!"

"అయితే ఎక్కడకి పోతయ్యి నానా? ఎవరో పరాయోడికి ఇస్తున్నట్టు మాట్టాడతావే? నీకు కూతురు అయితే నాకు చెల్లెలు కదూ! అమ్మాయి మీద నీకెంత బాధ్యత ఉందో, తోడబుట్టినోడిగా నాకూ అంత బాధ్యత ఉంది. అమ్మాయిని అల్లాటప్పావాడికి ఇచ్చే పనిలేదు. ఎంత కట్నం అయినా పెట్టి ఉజ్జోగస్తుడికి ఇద్దాం"

"ఉజ్జోగస్తుడ్ని మనం ఎక్కడ తెస్తాం లేరా? మనశక్తిఎంతా, మనస్తాయి ఎంతా?"

"అట్టంటావేంది నానా? ఒక్కమ్మాయి మనకి. మంచి సమ్మంధం చూసి చేస్తే జీవిత పర్యంతం సుఖపడుతుంది. కట్నం మాటిమాటికీ ఇస్తామా? ఇయ్యేటికీ, మీదటకీ పెళ్ళి చెయ్యంకదా? ఈ లోపు నేను నిలదొక్కుకోనా, నేను డబ్బు ఇయ్యానా? అమ్మాయి విషయంలో మాత్రం వెనకాడేది లేదు" అన్నాడు వేణు.

రాములు బేంకిలో కూతురు కోసం దాచిపెట్టిన డబ్బులోనించి యాభైవేలు తీసి కొడుక్కి ఇచ్చాడు.

ఆ డబ్బు చేతపట్టుకుని కొడుకు టౌన్‌కి చేరుకున్నాడు.

వ్యాపారం మొదలుపెట్టాడు.

కలిసి వచ్చింది.

రెడీమేడ్ బట్టల వ్యాపారమే గాకుండా రియల్ ఎస్టేట్ బిజినెస్ లోనికి దిగాడు. భూములు కొనడం, అమ్మడం చేశాడు. కొద్దికాలంలోనే బాగా సంపాదించాడు.

సొంతంగా ఇల్లు కొత్తగా కట్టుకుంటున్నాడు.

ఇప్పుడు చెల్లెలి పెళ్ళి ప్రస్తావనే తీసుకురావడంలేదు.

తను వెళ్ళి ఆ విషయం ప్రస్తావించినా "చూద్దాం,చేద్దాం" అంటున్నాడే తప్ప గట్టిగా పట్టించుకున్నది లేదు.

రజని బంగారు బొమ్మే.

ఎంత బంగారు బొమ్మయినా కట్నం లేకుండా చేసుకునే వాళ్ళు ఎవరు ఉంటారు? అంతా డబ్బుమీద నడుస్తున్న కాలం!

రజని ఇంటర్మీడియట్ వరకూ చదువుకుంది. చదువులో బాగా పోయేది. అంతకంటే పై చదువులు చదివించడం తమ స్థాయికి తగినది కాదనే ఉద్దేశంతో అంతటితో ఆపించారు.

రెండేళ్ళు ఇంట్లోనే ఉంది.

ఇప్పుడు ఊళ్ళోనే ఉన్న ఒక ప్రైవేట్ స్కూల్లో టీచర్‌గా చేరింది. నెలకి వాళ్ళు ఆరువందల రూపాయలు ఇస్తున్నారు.

కొడుకు 50 వేలు తీసుకుపోగా మిగిలిన 50 వేలు తను పోగొట్టాడు.

అవి మట్టిపాలయ్యాయి!

ఐదేళ్ళ నుంచీ వ్యవసాయం ఎత్తుబడిపోయింది.

పొలానికి పెట్టడమే తప్ప పైసా తిన్నది లేదు. ఏఏటికాయేడు దండగే!

జూదం కంటే వ్యవసాయం హీనమైపోయింది. జూదంలో ఒకసారి కాకపోతే ఒకసారైనా ఒక రూపాయైనా చేతికి వస్తుందేమోకాని, వ్యవసాయంలో రావడం అనే మాట లేకుండా పోయింది.

వానల్లేవు. పైరుల్లేవు. పంటల్లేవు. పసుల్లేవు.

ఒకవేళ మంచివాన పడితే, ఆశతో విత్తునాటినా, మరో వానలేక పైరు ఎండిపోయి రైతు తినేదేం లేకుండా పోయింది.

ఈ ఐదేళ్ళ నుంచీ 50 వేలు పోవడమే కాదు, మరో పదివేలు బాకీ తేలారు.

కట్నంకాదు, కనీసం పెళ్ళి చేయడానికి ఖర్చులకి కూడా ఇవ్వాళ చేతిలో డబ్బులేకుండా పోయింది. ఒకవైపు వ్యవసాయం రోజు రోజుకీ చితికిపోతుంటే, మరోవైపు రజనికి వయసు పెరిగిపోతున్నది. ఏం చేయాలో, ఎలా బయటపడాలో దారీ తెన్నూ తెలియకుండా ఉంది.

"లేయ్యా అన్నం పెడతా. పొలం పోవాలంటివీ?" భార్య మాటలకి ఆలోచనల్నించి బయటపడిన రాములు లేచాడు.

"కాలం ఎంత తిరగబడిపోయిందే! ఒక్కగానొక్క బిడ్డకి పెళ్ళి చేయలేకపోయామే! ఛ... ఈ ఎగసాయం చేసేకంటే ఏడూళ్ళు అడక్కతింటం మంచిదనిపిస్తంది. చూస్తాచూస్తా ఎంత డబ్బు పోగొట్టుకున్నామే!" దిగులుగా అన్నాడు రాములు, భార్యని అనుసరించి లోపలికి వెళ్తూ.

గంగమ్మ వడ్డించగా, రాములు తిని "చేనుకి పోతున్నా" అంటూ బయటకి వెళ్ళిపోయాడు.

కొడుకు డబ్బు ఇస్తాడనే నమ్మకం లేకపోయినా, భార్య మాటని కాదనలేక మరుసటి రోజు ఉదయం ప్రయాణమై టౌన్‌కి కొడుకు దగ్గరికి వచ్చాడు రాములు.

కోడలు ఆప్యాయంగా పలకరించి, యోగక్షేమాలు విచారించింది. రజనినీ, అత్తయ్యనీ తీసుకువస్తే బాగుండేదనీ, వాళ్ళు వచ్చి చాలా రోజులవుతోందనీ నిష్ఠూరంగా మాట్లాడింది.

తరువాత కొడుకుతో రాములు రజనికి పెళ్ళి చేయాల్సిన విషయమూ, డబ్బు విషయమూ ప్రస్తావించాడు.

"నేను బిల్డింగ్ కట్టుకుంటున్నాను నానా. డబ్బు నాకే కొరవపడేటట్టుగా ఉంది. నేనే మనూరు వచ్చి నిన్ను అడుగుదామనుకుంటన్నా"

"నాకు నువ్వయినా, అమ్మాయైనా ఒకటేనయ్యా! ఇద్దరూ రెండు కళ్ళలాంటివాళ్ళు. అమ్మాయి కట్నం కోసం అని ఉంచిన డబ్బులో అప్పుడు యాభైవేలు తీసుకున్నావు కదా తిరిగి ఇస్తాననీ! కనీసం అయ్యి అయినా తిరిగి ఇస్తే ఎవరో మనకి తగ్గవాళ్ళని, గంతకి తగ్గ బొంతని చూసి అమ్మాయికి మూడుముళ్ళు వేయిస్తే మనకి ఒక భారం తగ్గిపోయిద్దయ్యా!"

" నా దగ్గిర ఉంటే ఇయ్యనా నానా! నువ్వు ఇన్నిసార్లు అడగాలా? చెపతన్నా కదా, నాకే బిల్డింగ్‌కి కొరవ పడతయ్యనీ..."

"వ్యవసాయం బాగుంటే అసలు నిన్ను అడగాల్సిన అవసరమే ఉండేది కాదయ్యా! ఏటికేటికీ వానలు తగ్గిపోతన్నయ్యి. పంట తగ్గిపోతంది. ఖర్చులు అధికమవతన్నయి. పొలానికి రూపాయి పెట్టుబడి పెడితే అద్దురూపాయ చేతికి వస్తంది"

"మరి అసుంటప్పుడు దాన్ని పట్టుకుని యేలాడబడేది ఎందుకు నానా? నాలుగు రూపాయలు వస్తే పర్లేదు. ఎదురు పెట్టాల్సి వస్తందే! మీ మతమే మీదాయె, చెబితే యినుకోరాయె!"

"మరేం చేయమంటావురా? ఆపని తప్పమాకు ఇంకోపని చేతకాదు. ఐతకాలిగా"

"మీరు పని చేయాల్సిన అవసరం ఏమొచ్చింది? నేను చెప్పినట్టు యినండి. పొలం అమ్మిపారేస్తే ఎంతో కొంత డబ్బు చేతికి వచ్చిద్ది. అమ్మాయికి కొంత ఇచ్చిపెళ్ళిచేసి, మీరు ఇక్కడికి వచ్చి నా దగ్గిర ఉండండి. మిమ్మల్ని పువ్వుల్లో పెట్టి చూసుకుంటా!"

పొలం అమ్మడం కాదు, అమ్మిపారెయ్యడమే! ఎంత తేలిగ్గా అన్నాడు.

కొడుకు మాటలకి బాధ కలిగింది రాములికి.

అసలు ఆ మాటలు ఎంత నమ్మకం! తమని ఎంత బాగా చూసుకుంటాడో! పువ్వుల్లో పెట్టికాదు, కట్టెల్లో పెట్టి!

చెల్లెలి పెళ్ళి చేస్తానని, పెద్ద పెద్ద కోతలు కోసి తన వద్ద డబ్బుతీసుకుని, ఇవ్వాళ ఆ విషయమే తలుచుకోని వాడు...

"ముసలి వాళ్ళం అయినప్పుడో, కాలో చెయ్యో పడిపోయినప్పుడో నీ దగ్గరికి వచ్చి ఉన్నా విలువుండిద్దికానీ, ఇప్పుడే రమ్మంటా? మేం ఇక్కడికి వస్తే మమ్మల్ని కూర్చోబెట్టి మేపుతా?"

"అదేందినానా అట్టంటావు? బయటివాళ్ళమా? నా దగ్గిర ఉంటానికేం? పొలం అసలు వద్దునానా! దానికి ఎదురు ఎక్కడ పెడతాం? నాకూ వ్యాపారానికి డబ్బు అవసరం. స్థలాలు కొనడం, అమ్మడం! రియల్ ఎస్టేట్ బిజినెస్. పిచ్చి లాభాలు! సరిపడినంత డబ్బులేక ఇంకా సంపాయించలేకపోయాను కానీ, నా దగ్గిర ఇంకొంత డబ్బుఉంటే ఈ పాటికి ఎంత సంపాయించి ఉండేవాడ్నో! పొలం అమ్మదాం నానా"

"ఒరేయ్.. పొలం నా ఊపిరిలో ఊపిరి లాంటిదిరా! నా ఊపిరి ఉన్నంతకాలం పొలం అమ్మేదేం జరగదు. మిమ్మల్ని పెంచి పెద్దచేసామంటే, ఇయ్యాల నువ్వు ఈ స్థితిలో ఉన్నావంటే ఈ మాత్రం పొలం ఉండబట్టే! మీ మామ నీకు పిల్లనిచ్చింది నువ్వు వెలగబట్టే ఉజ్జోగాన్ని చూసో, నీ తెలివిని చూసో, నీ చక్కదనాన్ని చూసో కాదు. నీ వెనుక వున్న కొద్ది పొలాన్ని చూసి. పొలం అంటే కన్నతల్లి లాంటిదిరా. ఇయ్యాల నాలుగు రూపాయలు సంపాయించావని మనకి బువ్వపెట్టే పొలాన్ని అమ్మమంటావా?"

"పొలం పండితే మంచిదేనానా! అది పండకపోతండే... ఏటికేటికీ దండగలు ఎక్కువవతండే!"

"ఎల్లకాలం దండగలు పడతాం ఏందీ? అట్ట పొలంలో ఎప్పుడూ దండగలు పడే పనయితే దేశంలో ఎవుడూ పొలం చేయడు. ఇక జనం అంతా ఏం తిని బతుకుతారు? కొట్టిన అమ్మే పెట్టకమానదు. ఇయ్యాల కాకపోతే రేపైనా వానలు కురవకపోవూ, పొలం పండకాపోదు!"

"సరే నీ ఇష్టం నానా? నేను చెప్పాల్సింది చెప్పా. నా మాట విననికాడికి ఎందుకు ఇంకా? అమ్మాయి పెళ్ళి ఎట్నో మీరే చేసుకోండి. నా దగ్గిర మాత్రం రూపాయి లేదు. అప్పుడు ఉన్న లక్ష రూపాయల్లో నావాటా యాభైవేలు నేను తీసుకున్నా. అమ్మాయి వాటా డబ్బు మీరు పొలంలో పెట్టి నష్టపోయారు. ఇంక నాకు సమ్మంధం లేదు. అమ్మాయి పెళ్ళి చేసిన తరువాత నా వాటాకి వచ్చే పొలమేదో నాకు పంచియ్యండి" తేల్చి చెప్పాడు వేణు.

"సరేనబ్బాయి. అట్నే చేద్దాం" అని తిరిగి ఊరికి వచ్చాడు రాములు.

ఇంటికి వచ్చేసరికి బాగా పొద్దుపోయింది.

"అబ్బాయి ఏమన్నాడయ్యా?" భర్త కోసమే ఎదురు చూస్తున్న గంగమ్మ ఆయనకి నీళ్ళుతోడి, అన్నం పెట్టి తరువాత అడిగింది మనసులో భయపడుతూనూ, సంకోచపడుతూనూ.

"ఏ మంటాడు?" అంటూ జరిగిన విషయం మొత్తం చెప్పాడు.

"ఈ కాలంలో బిడ్డలు ఎవరో, అబ్బా అమ్మలు ఎవరో..." బాధతో అంది గంగమ్మ.

"అమ్మాయి ఎటుపోయిందే?"

"రెండు జతల డ్రెస్సులు తెచ్చుకుంటానని టౌన్‌కి పోయిందయ్యా"

"గంగమ్మత్తా... ఫోనొచ్చింది" అంటూ పక్కింటి అమ్మాయి కేకేసి చెప్పింది.

"ఎక్కడ్నించి అయ్యుండిద్దీ?" అంటూ రాములు వడివడిగా వెళ్ళి ఫోనందుకున్నాడు.

"నేను నాన్నా రజనిని. ట్రంకు పెట్టెలో ఒక పుస్తకం ఉంది. అందులో ఒక ఉత్తరం రాసిపెట్టా. చదువుకోండి అది" అని, మరో మాట ఏం మాట్లాడకుండా ఫోన్‌పెట్టేసింది.

ఫోన్లో "ఏందమ్మాయి... ఏందమ్మాయి" అంటున్నా, ఆయన మాట వినకుండానే ఫోన్ పెట్టేసింది.

"ఏమై ఉండిద్దా?" అంటూ ఆందోళనగా వచ్చిన రాములు, పెట్టెలో ఉన్న పుస్తకంలోనించి ఉత్తరం తీసుకున్నాడు.

"అమ్మా నాన్నా...

నేను మా స్కూల్లో పనిచేస్తున్న శ్యాంబాబుని ప్రేమించాను. రేపు అతన్ని పెళ్ళి చేసుకుంటున్నాను. అతను బిఎస్సీ బియిడీ చేశాడు. మంచివాడు. బుద్ధిమంతుడు. అయితే మనకంటే తక్కువ కులం. మీరు మా పెళ్ళికి వప్పుకోరని తెలుసు. అందుకే ఇంట్లోనించి వెళ్ళిపోతున్నాను. మేం కొంతకాలం వరకూ రాదలుచుకోలేదు. మీరు మా కోసం వెదికే ప్రయత్నం చేయవద్దు. నేను మాత్రం తప్పుపని చేయడం లేదని భావిస్తున్నాను.

ఇట్లు

మీ కూతురు రజని.

భార్య వినేలా ఉత్తరం పెద్దగా చదివిన రాములు నోట్లోనించి మాటరాక నిశ్చేష్టుడైపోయాడు.

గంగమ్మ ఏడుపుకి లేచింది.

తరువాత నాలుగు రోజులకి గంగమ్మ స్థిమితపడింది.

ఆలోచిస్తే కూతురు మంచిపనే చేసింది అనిపించింది ఆమెకి.

ప్రజాతంత్ర వారపత్రిక - 14 జనవరి, 2006